సాక్షి అనంతపురం

మంగళవారం । 19 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.35,100

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35,100 పలికాయి.



టమాట కిలో రూ.30

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టం రూ.16, సరాసరి రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.4°/19.1°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు ఎస్కేయూ పాలక మండలి సమావేశం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సమావేశం మంగళవారం జరగనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారి పూర్తిస్థాయి పాలక మండలి సమావేశం నిర్వహిస్తున్నారు. క్యాంపస్‌లో వైఎస్సార్ విగ్రహం తొలగించాలనే ఒకే అంశంపై కొత్త ప్రభుత్వం ఏర్పడిన వారం రోజులకే సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత ఇన్నాళ్లకు మళ్లీ నిర్వహిస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఉద్యోగానికి రాజీనామా చేసిన జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్‌ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా వెళ్లిన త్రివేణి తిరిగి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రావాలని విన్నవించడంతో ఈ విషయంపైనా పాలకమండలి నిర్ణయం తీసుకోనుంది. కొన్ని కారుణ్య నియామకాలపై చర్చించనున్నారు.

వివాదాస్పద అంశాలపై స్పష్టత!

వర్సిటీ హాస్టళ్లలో ఉద్యోగాల భర్తీకి ప్రయత్నాలు జరుగుతున్నాయి. హాస్టళ్లలో పనిచేసే వారికి ఇప్పటిదాకా వర్సిటీనే జీతాలు చెల్లిస్తోంది. అయితే ఇకపై కొత్తగా తీసుకునే ఉద్యోగులకు విద్యార్థులే జీతాలు చెల్లించేలా ప్రతిపాదనలు చేశారు. దీంతో హాస్టల్‌లో ఉండే విద్యార్థులపై ఆర్థిక భారం పడనుంది. ఇలాంటి నిర్ణయాలు వర్సిటీ చరిత్రలో తీసుకోలేదు. యాజమాన్య హాస్టళ్ల పేరుతో అస్మదీయులకు ఉద్యోగాలు కట్టబెట్టి, విద్యార్థులతోనే జీతాలు చెల్లించేలా ఎత్తుగడలు వేస్తుండటం గమనార్హం. అయితే పాలకమండలి ఇందుకు ఆమోదం తెలుపుతుందా? అనే అంశంపై స్పష్టత రానుంది.

పది పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 26 వరకూ పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ. 50 అపరాధ రుసుంతో ఈనెల 27 నుంచి డిసెంబర్ 2 వరకు, రూ. 200 అపరాధ రుసుంతో డిసెంబరు 3 నుంచి 9 వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబరు 10 నుంచి 16 వరకు ఫీజు చెల్లించవచ్చని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ. 125, మూడు సబ్జెక్టులకంటే ఎక్కువ ఉంటే రూ. 125, మూడులోపు సబ్జెక్టులకు రూ. 110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు అదనంగా రూ. 60 చెల్లించాలి.

హాస్టల్.. హడల్

ఒకే గదిలో తరగతి గది, వసతి గృహం నిర్వహిస్తున్న దృశ్యమిది. కళ్యాణదుర్గం మారెంపల్లి కాలనీలో ఉన్న ఎస్టీ బాలుర వసతి గృహంలో ఈ దుస్థితి నెలకొంది. పాఠశాలలో మొత్తం 250 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు సరిపడా వసతి గదులు, తరగతి గదులు లేక ఆరుబయట, వరండాలలో చదువుకుంటున్నారు. ఒక్కోగదిలో 20 మంది వరకు ఉంటున్నారు. సుమారు 20 మందికి కలిపి ఒకే మరుగుదొడ్డి ఉంది. దీన్ని బట్టి హాస్టల్‌లో విద్యార్థుల అవస్థలు అర్థం చేసుకోవచ్చు.



ఉరవకొండ ఎస్సీ బాలికల వసతి గృహ ఆవరణలో మద్యంరాయుళ్లు తాగి పడేసిన బాటిళ్లు ఇవి. హాస్టల్‌కు వాచ్‌మెన్ లేకపోవడం, వార్డెన్ సాయంత్రమైతే అనంతపురం వెళ్లిపోతుండటంతో రాత్రిళ్లు విద్యార్థినులకు రక్షణ కరువైంది. ఇప్పటికే వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. చిన్నపాటి వర్షానికే గదులు కారుతుండటంతో విద్యార్థినులు వరండాలోకి వచ్చి నిద్రపోతున్నారు. ఇక.. హాస్టల్‌లో ఉన్న మరుగుదొడ్లలో కేవలం ఒక్క దానికే తలుపు ఉంది. ఆ ఒక్క రూమ్‌నే బాలికలు వినియోగించుకుంటున్నారు.



- సంక్షేమ వసతి గృహాల్లో సమస్యల తిష్ట
- మెనూ అమలులో తీవ్ర నిర్లక్ష్యం
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- పేద పిల్లలపై కూటమి సర్కారు చిన్నచూపు

అనంతపురం రూరల్: పేద విద్యార్థులను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. 'వారికేమైతే మాకేం' అన్నట్లు వ్యవహరిస్తోంది. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తున్నా పట్టనట్లు వ్యవహరిస్తోంది. చాలా వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. ఉడకని అన్నం, నీళ్ల సాంబారుతోనే సరిపెడుతున్నారు. కనీసం తాగడానికి నీరు ఉండటం లేదు. సరిపడా గదులు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికి సైతం కష్టాలు తప్పడం లేదు. మినరల్ వాటర్ బదులు బోర్ల నీటిని వాడుతున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. దీంతో పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. బాలికల హాస్టళ్ల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. చాలా హాస్టళ్లకు ప్రహరీ కూడా లేకపోవడంతో బాలికల భద్రత గగనంలా తయారైంది.

గతంలో ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడానికి హాస్టళ్ల మెనూలో మార్పులు తీసుకొచ్చారు. డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచి ఠంచనుగా అందించారు. ప్రభుత్వ పాఠశాలల తరహాలోనే వసతి గృహాల్లో సైతం నాడు– నేడు పనులకు శ్రీకారం చుట్టారు. క్రమం తప్పకుండా జిల్లా, మండల స్థాయి అధికారుల బృందం వసతి గృహాల్లో పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.

నేడు అధ్వానం..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. గత ప్రభుత్వంలో మాదిరి అధికారుల బృందాలు వసతి గృహాల్లో తనిఖీలు చేపడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. హాస్టళ్లలో లోటుపాట్లను గుర్తించి విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన సంక్షేమ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల సంక్షేమశాఖ అధికారులు, వార్డెన్లు కుమ్మక్కు కావడంతో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. విద్యార్థుల కడుపులు మాడ్చుతున్నారు. వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులపై న్యాయస్థానాలు సైతం ప్రశ్నిస్తున్నా ప్రభుత్వంలో మాత్రం మార్పు రావడం లేదు.

విద్యార్థుల సతమతం..

వసతి గృహాల్లో సమస్యల నడుమ విద్యార్థులు మానసికంగా చితికిపోతున్నారు. అనంతపురం బీసీ సంక్షేమశాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బీసీ బాలుర జూనియర్ కళాశాల హాస్టల్‌లో తేజా అనే విద్యార్థి ఇటీవల ఉరేసుకున్నాడు. మౌలిక వసతులు లేని వసతి గృహంలో సర్దుకుపోలేక, అదే క్రమంలో ఇంటికి వెళ్లలేక మానసిక క్షోభకు గురై హాస్టల్ బాత్‌రూమ్‌లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదేవిధంగా నగరంలోని బీసీ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహంలో ఉంటూ ఇంటర్ చదువుతున్న ఓ బాలిక రెండు నెలల క్రితం బయటికి వెళ్లి ఆత్మకూరు మండలం వడ్డిపల్లి సమీపంలో హత్యకు గురైంది. వసతి గృహాల్లో ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.



అనంతపురం జూనియర్ కళాశాలలో ఉన్న హాస్టల్‌లో దుస్థితి

జిల్లాలో వసతి గృహాల వివరాలు

09 ఎస్సీ గురుకులాలు	05 బీసీ గురుకులాలు	06 ఎస్టీ గురుకులాలు
55 బీసీ వసతి గృహాలు	50 ఎస్సీ వసతి గృహాలు	05 ఎస్టీ వసతి గృహాలు
08 ఎస్సీ రెసిడెన్షియల్ స్కూళ్లు	మొత్తం విద్యార్థులు 20,000	

అడుగు బయట పెట్టలేం



వసతి గృహం ప్రాంగణంలో విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంటోంది. రాత్రివేళ అడుగు బయట పెట్టాలంటే విషపురుగుల భయం వెంటాడుతోంది. అలాగే, హాస్టల్‌లోని మరుగుదొడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. మలవిసర్జనకు ఆరుబయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

– నితిన్, 7వ తరగతి విద్యార్థి, పామిడి

రాత్రి పూట దోమల బెడద



హాస్టల్‌లో డోర్‌లు సరిగ్గా పడటం లేదు. రాత్రిళ్లు దోమలు విపరీతంగా కుడుతున్నాయి. సరిగా చదువుకోలేకపోతున్నాం. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. రోజూ ఆరుబయటే స్నానాలు చేస్తున్నాం. దుప్పట్లు కూడా ఇవ్వలేదు. ఇంటి నుంచే తెచ్చుకున్నాం. తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

–భాస్కర్, 8వ తరగతి, బొమ్మనహాళ్

సమస్యలు పరిష్కరించాలి



హాస్టల్‌లో మరుగుదొడ్లు సరిగా లేవు. కిటికీలకు మెష్ లేదు. ఆరు బయట స్నానాలు చేయాల్సిన పరిస్థితి. దీంతో మురుగునీరు సమీపంలోనే చేరి దుర్గంధం వస్తోంది. వీటన్నింటి నడుమ చదువు సాగించడం కష్టంగా ఉంటోంది. వసతి గృహాల్లోని పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుంది.

– రవితేజ, 10 వ తరగతి, పెద్దవడుగూరు ఎస్సీ హాస్టల్



పామిడి హాస్టల్ ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు



రక్షణ లేని రాయదుర్గంలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహం



ఉరవకొండ బీసీ బాలుర వసతి గృహం పైకప్పు పెచ్చులూడిన దృశ్యం



గుత్తి కోటవీధి బీసీ సంక్షేమ హాస్టల్లో పాడైపోయిన మరుగుదొడ్లు

సంకటహర.. సాయిగోపాలా



పుట్టపర్తిలో భక్త జనవాహిని నడుమ సాగుతున్న వేణుగోపాల స్వామి రథోత్సవం

- ప్రారంభమైన సత్యసాయి 99వ జయంత్యుత్సవాలు

ప్రశాంతి నిలయం: సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలు సోమవారం అంతర్జాతీయ అధ్యాత్మిక ధామం ప్రశాంతి నిలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలను పురస్కరించుకుని సత్యసాయి మహా సమాధిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధి చెంత ఉదయం 8 గంటలకు వేదపఠనంతో సత్యసాయి జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితులు పూజల అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. దేశ విదేశాలకు చెందిన 2,700 మంది వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు సత్యనారాయణ రాజుగా పిలవబడే సత్యసాయి బాబా అవతార వైభవాన్ని, ఆయన లీలామృతాన్ని వివరించారు.

పురవీధుల్లో ఊరేగిన వేణుగోపాలుడు..

సాయికుల్వంత్ సభా మందిరంలోని మూలవిరాట్టు వేణుగోపాల స్వామికి, ఉత్సవ మూర్తులైన సీతారామ, లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ పండితులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. మూలవిరాట్టును, ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగింపుగా ప్రశాంతి నిలయం ఉత్తర గోపురం వద్దకు తీసుకువచ్చి వేణుగోపాలుడిని రథంలో కొలువుదీర్చారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు నాగానంద, పలువురు ట్రస్ట్ సభ్యులు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులు సాయిగోపాలుని నామాన్ని స్మరిస్తూ ముందుకుసాగారు. ప్రజలు అడుగడుగునా నారికేళాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవంలో సత్యసాయి బాల వికాస్ చిన్నారులు నెమలి నాట్యం, మహిళలు కోలాటం, కళాకారుల గరగ నృత్యం అందరినీ అలరించారు. కాగా, సత్యసాయి జయంత్యుత్సవాల్లో భాగంగా ప్రశాంతి నిలయంలోని నార్త్ బిల్డింగ్స్ వెనుక ఉన్న మైదానంలో మహానారాయణ సేవ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 24 వరకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అన్న ప్రసాద వితరణ చేయనున్నారు.



అన్న ప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

కురుబల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత జగన్‌దే





కనకదాస విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శంకర్‌నారాయణ, మాజీ ఎంపీ మాధవ్, తదితరులు, బైకు ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు

- మాజీ మంత్రి శంకర్ నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్
- భక్త కనకదాసకు ఘన నివాళి

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించి కురుబల ఆత్మగౌరవాన్ని కాపాడారని మాజీ మంత్రి శంకర్ నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. సోమవారం భక్త కనకదాస జయంతిని పురస్కరించుకుని నగరంలో ఎంపీ గోరంట్ల మాధవ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. పాతూరులోని కనకదాస విగ్రహం వరకు సాగిన ర్యాలీలో మాజీ మంత్రి శంకర్ నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకురాలు శివబాల తదితరులు పాల్గొన్నారు. కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ నారాయణ మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్న సమయంలో భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని జగనన్నకు విజ్ఞప్తి చేయగా.. వెంటనే ప్రత్యేక జీఓ విడుదల చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కనకదాస జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కీర్తనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చిన గొప్ప కవి కనకదాసు అని కొనియాడారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి చొరవ తీసుకుని కనకదాస జయంతిని సెలవు దినంగా ప్రకటించేలా సీఎం చంద్రబాబును ఒప్పించాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకురాలు శివబాల మాట్లాడుతూ కుప్పంలో కనకదాస విగ్రహావిష్కరణలో భాగంగా సీఎం చంద్రబాబు కురుబలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల ఓవరాక్షన్..

కనకదాస విగ్రహానికి పూలమాల వేసేందుకు వెళ్తున్న మాజీ మంత్రి శంకర్ నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. గతంలో కనకదాస జయంతి రోజున తాము అన్ని పార్టీల వారిని ఆహ్వానించే వారమని, నేడు ఇలా అడ్డుకోవడం సరికాదని మాజీ మంత్రి శంకర్ నారాయణ పోలీసులకు చురకలంటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పామిడి వీరాంజినేయులు, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, చిత్రా వెంకటేష్, పసుపుల ఆది, బుల్లే లింగ ప్రసాద్, నసనకోట ముత్యాలు, పెనుకొండ పరమేష్, ఉజ్జినప్ప, రామాంజినేయులు,సోమందేపల్లి ఎంపీపీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో ముందుండాలి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



భక్త కనకదాస విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత, తదితరులు

అనంతపురం టవర్‌క్లాక్: బీసీలు అన్ని రంగాల్లో ముందుండాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. నగరంలో సోమవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కనకదాస రాష్ట్ర స్థాయి జయంత్యుత్సవం నిర్వహించారు. గుత్తి రోడ్డులో ఉన్న కనకదాస విగ్రహానికి మంత్రి సవిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుత్తి రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భక్త కనకదాస తన కీర్తనలతో ప్రతి ఒక్కరినీ చైతన్యపరిచారన్నారు. అధికారికంగా కనకదాస జయంతిని జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కురుబలకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. తిరుమలలో కనక పీఠం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. టీటీడీ మెంబర్‌గా కురుబలకు అవకాశం ఇవ్వాలని, శ్రీశైలం ఆలయ కమిటీలో కూడా స్థానం కల్పించాలని సీఎంని కోరతానన్నారు. కార్యక్రమంలో ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున, కలెక్టర్ వినోద్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం విజయ భాస్కర్ రెడ్డి, మాజీ మేయర్ రాగే పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన కురుబ కులస్తులు

లేఖ చాటు లీలలు

మద్యం షాపుల్లో మరో మాయ

- అమరావురంలో బిజినెస్ లేదంటూ రాయదుర్గం మార్చేందుకు ఎమ్మెల్యే రాజు లేఖ
- తనకేమీ అభ్యంతరం లేదని రాయదుర్గం ఎమ్మెల్యే మరో లేఖ
- ఆగమేఘాలపై ఫైలు కదిలించిన ఎక్సైజ్ అధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారులో అధికార దుర్వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. ఎమ్మెల్యేలు ఏది చెబితే అదే గెజిట్‌గా మారుతోంది. మద్యం షాపుల వేలంలో సామాన్యులను బెదిరించి తమ వశం చేసుకున్న తెలుగు తమ్ముళ్లు.. ఇప్పుడు ఏకంగా ఒక జిల్లా నుంచి షాపును మరో జిల్లాకు తీసుకెళ్లేందుకు ఎత్తుగడ వేశారు.

అలా లేఖలు.. ఇలా అనుమతులు

నెల రోజుల క్రితం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో మద్యం షాపుల వేలం పాట జరిగింది. మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలంలో పీఎం సచిన్ అనే వ్యక్తి మద్యం షాపును (షాప్ నం.ఎస్ఎస్ఎస్84) దక్కించుకున్నారు. అయితే, అక్కడ వ్యాపారం సరిగా కావడం లేదని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును ఆశ్రయించగా.. ఆయన ఏకంగా ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు లేఖ రాశారు. 'అమరాపురంలో 55 వేల జనాభా ఉండగా చాలామంది బెంగళూరు వెళ్లారు. దీంతో తాగే వాళ్లు తక్కువగా ఉన్నారు. అందుకే అమరాపురం నుంచి షాపును రాయదుర్గం మార్చండి' అంటూ లేఖలో విన్నవించారు. ఇందుకు తానా తందానా అంటూ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కూడా మంత్రికి లేఖ రాశారు. రాయదుర్గంలో మద్యం షాపు పెట్టుకుంటే తనకేమీ అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ఇద్దరు శాసనసభ్యులు లేఖలు ఇవ్వడంతో ఎక్సైజ్ అధికారులు ముందూ వెనక చూడకుండా ఫైలు కదిలించారు.

ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మార్చవచ్చా?

ఎమ్మెల్యేలు షాపు మార్చండంటూ లేఖలు ఇవ్వడం, ఎక్సైజ్ అధికారులు వంత పాడటం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒక జిల్లాలో వ్యాపారం జరగకపోతే ఇంకో జిల్లాకు షాపులు మార్చుకోవచ్చా? అక్కడ షాపులు వేలం పాడిన వారి పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఎక్కడ వేలం పాడుకుంటే అదే ప్రాంతంలో షాపు ఏర్పాటు చేయాలి. కానీ, నిబంధనలు తోసిరాజని ఏకంగా మరో జిల్లాకు షాపు మార్చడం వెనుక ఎంత డబ్బు చేతులు మారిందోనని ఎక్సైజ్ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఇటీవల బుక్కరాయసముద్రం పరిధిలో ఓ వ్యక్తి మద్యం షాపును ఏర్పాటు చేసుకుంటే.. మంత్రి అనుచరుడు తనకు వ్యాపారం జరగలేదంటూ బెదిరించి ఖాళీ చేయించారు. కూటమి ప్రభుత్వంలో మద్యం సిండికేట్లు, బెల్టుషాపులు, పర్మిట్ షాపులు ఇలా ఏదైనా సరే ఎమ్మెల్యేల ఆగడాలు శ్రుతి మించుతున్నాయని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తీరని కష్టాలు.. కదిపితే కన్నీళ్లు!



ఈమె పేరు హరిజన గంగమ్మ. వయస్సు 87 ఏళ్లు. కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరులో నివాసముంటున్న ఈమెకు ఇద్దరు కొడుకులు, ఓ కుమార్తె ఉంది. కొడుకుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. కూలి పనికి వెళితే తప్ప పూట గడవదు. దీంతో వారానికి ఒకరు చొప్పున తల్లిని పంచుకుని అన్నం పెడుతున్నారు. ఇక కుమార్తె భర్తను కోల్పోయి తల్లి పంచన చేరింది. తల్లి, కుమార్తె ఒకే రేషన్ కార్డులో ఉండడంతో ఆమెకు పింఛన్ వస్తోందని నాలుగేళ్ల క్రితం గంగమ్మను పింఛన్ జాబితా నుంచి తొలగించారు. ఇటీవల కుమార్తెకు క్యాన్సర్ నిర్ధారణ అయింది. కనీసం మందుల కొనుగోలుకు సైతం డబ్బు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో కలెక్టర్ ఆఫీసులో అర్జీ ఇస్తే పింఛన్ వస్తుందని తమ ఊళ్లో సారోళ్లు చెబితే ఆశతో ఇంత దూరం వచ్చానని కన్నీటితో తన గోడు వెళ్లబోసుకుంది.

.... ఈ పరిస్థితి ఒక్క హరిజన గంగమ్మదే కాదు... జిల్లా వ్యాప్తంగా చాలా మంది అన్ని విధాలుగా అర్హత ఉన్నా... సామాజిక భద్రత పింఛనఅందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు పింఛన్ మంజూరు చేయాలంటూ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు రోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదు. దీంతో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి బాధితులు పోటెత్తుతున్నారు. వీరిలో ఏ ఒక్కరిని కదిపినా... వారి కష్టాలు కన్నీటి రూపంలో బయటపడుతున్నాయి. ఒక్కొక్కరిదీ ఒక్కొక్క కష్టం. మాటల్లో చెప్పలేని వేదన.

- కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమానికి పోటెత్తిన వినతులు
- వివిధ సమస్యలపై 321 అర్జీలు
- ప్రతి అర్జీ పరిష్కరించాలని జేసీ ఆదేశం

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. స్థానిక రెవెన్యూభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మతో పాటు డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, శిరీష, జిల్లా వ్యవసాధికారి ఉమా మహేశ్వరమ్మ, డీపీఓ నాగరాజు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 321 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ప్రతి సమస్యకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివనారాయణశర్మ

వినతులు కొన్ని

- ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి 'డి పట్టా' మంజూరు చేయాలని గార్లదిన్నె మండలం పి.కొత్తపల్లికి చెందిన విశాలాక్షి విన్నవించింది. పెనకచర్ల గ్రామ పొలం సర్వే నెంబరు 209లో 2.50 ఎకరాల ప్రభుత్వ భూమిలో 30 ఏళ్లుగా పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపింది. తమకు ఈ భూమి తప్పితే మరో ఆధారం లేదంది. 'డి పట్టా, పాసుపుస్తకాలు' మంజూరు చేయాలని అధికారులను వేడుకుంది.
- బోరు సీజ్ చేయడంతో పంటకు నీరు పెట్టుకోలేని పరిస్థితి వచ్చిందని పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన రైతు వెంకటరెడ్డి విన్నవించాడు. సర్వే నెంబరు 109లో తనకున్న పొలంలో వేసుకున్న బోరును తహసీల్దారు సీజ్ చేశారని వాపోయాడు. సాగు చేసుకుంటున్న అరటి పంటకు నీరు తక్కువ కావడంతో పంట నష్టపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశాడు. సీజ్ చేసిన బోరును రిలీజ్ చేసి పైపులైన్ వేసుకునేందుకు అనుమతివ్వాలని వినతి పత్రం ఇచ్చాడు.

బతుకంతా కార్యాలయాల చుట్టే..




నాకు ఓ కన్ను కనిపించదు. బుక్కరాయసముద్రం గ్రామంలో నాకు 1994లో అప్పటి ప్రభుత్వం 2.50 సెంట్ల ఇంటి స్థలం ఇచ్చింది. ఆ స్థలంలో కొందరు మసీదు కట్టారు. తహసీల్దారుకు చెబితే మరో చోట స్థలం ఇస్తానన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ స్థలం ఇచ్చింది లేదు. సమస్య పరిష్కరించాలని తహసీల్దారుకు, ఆర్‌డీఓకి, డీఆర్‌ఓకి, కలెక్టర్‌కు ఇలా అందరికీ చాలా సార్లు అర్జీలు ఇస్తూనే ఉన్నా. నా బతుకంతా ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగేకి సరిపోయింది. ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు మళ్లీ అర్జీ ఇచ్చాను. ఇప్పుడైనా నాకు స్థలం చూపిస్తారో లేదో. – ఎస్.నల్లమ్మ, అంబేడ్కర్ నగర్, అనంతపురం

ఈ నినాదం ప్రభుత్వానికి హెచ్చరిక కావాలి

- న్యాయమైన సమస్యల పరిష్కారంలో కూటమి సర్కార్ మొండి వైఖరి
- ఆశ వర్కర్ల ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆశ కార్యకర్తలు



ధర్నాలో ప్రసంగిస్తున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం అర్బన్: ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారంలో కూటమి సర్కార్ మొండి వైఖరి అవలంబిస్తోందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మండిపడ్డారు. డిమాండ్ల సాధన కోసం విప్పిన గళం ఈ ప్రభుత్వానికి హెచ్చరిక కావాలని పిలుపునిచ్చారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ ఆశ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. సంఘం కార్యదర్శి నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ గేయానంద్‌తో పాటు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ హాజరై మాట్లాడారు. నిర్దేశించిన పనులు కాకుండా అదనపు పనులు చేయిస్తుండడంతో ఆశ వర్కర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎన్‌సీడీసీడీ సర్వే ఏఎన్‌ఎంలు చేయాలని అధికారులు చెబుతూనే ఆశ వర్కర్లతో చేయిస్తున్నారన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరి వివరాలను ఓటీపీతో చేయాల్సి ఉంటుందన్నారు. ఏఎన్‌ఎం చేయాల్సిన ఈ పని ఆశ వర్కర్ చేయాలంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాయదుర్గం, తాడిపత్రి పట్టణాల్లో ఒక్కొక్క ఆశా వర్కర్ పరిధిలో 3 వేలు, 4 వేలు, 6 వేలు చొప్పున జనాభా ఉందన్నారు. గుత్తి పట్టణంలోని 5వ సచివాలయం ఆశ వర్కర్ రేవతికి 6,986 మంది జనాభా ఉన్నారన్నారు. దీంతో పని ఒత్తిడి ఎక్కువై అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఆశ వర్కర్లు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలన్నారు. అనంతరం అధికారులకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు మాలతి, కోశాధికారి భారతి, నాయకురాళ్లు అక్కమ్మ, హుసేన్‌బీ, భాగ్యమ్మ, అంబిక, నాగమణి, సీఐటీయూ కోశాధికారి గోపాల్, ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కన్నకొడుకే దొంగ!

యల్లనూరు: జల్సాలకు అలవాటు పడిన యువకుడు తన అవసరాలు తీర్చుకునేందుకు ఏకంగా తల్లి మెడలోని బంగారు మాంగల్యం చైన్‌ను అపహరించుకెళ్లాడు. వివరాలను సీఐ సత్యబాబు, ఎస్ఐ శ్రీరాంప్రసాద్ వెల్లడించారు. ఈ ఏడాది జూలై 14న యల్లనూరుకు చెందిన పెద్దమ్మ తన మూడున్నర తులాల బంగారు మాంగల్యం చైన్ అపహరణకు గురైందంటూ భర్త నాగయ్య ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి... పక్కా ఆధారాలతో నాగయ్య కుమారుడు కోలాటం శంకర్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో తన తల్లి మాంగల్యం చైన్‌ను అపహరించుకెళ్లినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి సోమవారం ఉదయం మాంగల్యం చైన్‌ను స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నడిరోడ్డుపై ఆగిన '108'



కొర్రపాడు సమీపంలో నిలిచిన 108 వాహనం

శింగనమల: అత్యవసర వైద్య సేవల కోసం రోగులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 అంబులెన్స్ మార్గ మధ్యంలో మొరాయించింది. వివరాలు... శింగనమల పీహెచ్‌సీ నుంచి రోగులను అత్యవసర వైద్య సేవలకు అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలిస్తున్న 10 అంబులెన్స్... జాతీయ రహదారిపై కొర్రపాడు వద్దకు చేరుకోగానే టైరు పంక్చరు కావడంతో ఆగిపోయింది. స్టెప్నీ టైర్ లేకపోవడంతో కొన్ని గంటల పాటు ప్రాణాపాయ పరిస్థితిలో రోగులు ఇబ్బంది పడ్డారు. అదే సమయంలో తాడిపత్రి నుంచి రోగులను తీసుకుని వస్తున్న 108 అంబులెన్స్‌ను గమనించిన పైలెట్ దానిని ఆపి తన అంబులెన్స్‌లోని రోగులను ఎక్కించి పంపారు. అనంతరం పంక్చర్ అయిన టైరును తీసుకెళ్లి సరిచేయించుకుని సాయంత్రం శింగనమల పీహెచ్‌సీకి చేరుకున్నారు.

యువకుడి బలవన్మరణం

అనంతపురం: నగరంలోని సోమనాథనగర్‌కు చెందిన ఇటికల రాజారామ్ శెట్టి కుమారుడు జయరాంశెట్టి (25) ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు... ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న జయరాంశెట్టి ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తనకు బతకాలని లేదని, నాన్న దగ్గరకు వెళ్లిపోతానంటూ తరచూ భార్య జయనందినితో గొడవపడేవాడు. ఆదివారం సైతం ఇదే తరహాలో గొడవపడిన ఆయన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన జయనందిని మేనమామ అడ్డుకుని గది నుంచి బయటకు పిలుచుకుని వచ్చాడు . అయితే అప్పటికే విషపూరిత ద్రావకం తాగి ఉన్నట్లుగా గుర్తించి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆదివారం రాత్రి ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



నూర్ మహమ్మద్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గంలోని మారెంపల్లి కాలనీకి చెందిన నూర్ మహమ్మద్ అలియాస్ నూర్‌బాషా (35)కు భార్య రుక్సానా, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెయింటింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన సోమవారం మారెంపల్లి కాలనీలో సమీపంలోని రేషం తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కణేకల్లు క్రాస్‌లో వేటకొడవళ్లతో హల్‌చల్



దుండగులు వదిలేసిన బైక్



దుండగుల కోసం గాలిస్తున్న ప్రజలు

కణేకల్లు: కణేకల్లు క్రాస్‌లో సోమవారం సాయంకాలం ముగ్గురు దుండగులు వేటకొడవళ్లతో హల్‌చల్ చేశారు. సరిగ్గా ఎనిమిది నెలల క్రితం ఇదే ప్రాంతంలోని ఓ ఇంట్లో దుండగులు చొరబడి దోపిడీకి పాల్పడ్డారు. తాజాగా ఇదే ప్రాంతంలోని అవని గార్డెన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు వేడకొడవళ్లతో సంచరించడం తీవ్ర కలకలాన్ని రేపింది. ఇటీవల కొందరు ఆ ప్రాంతంలో పక్కా గృహాలు నిర్మించుకుని నివాసముంటున్నారు. సోమవారం సాయంకాలం 6 గంటల సమయంలో షైన్ బైక్‌పై వచ్చిన ముగ్గురు వేటకొడవళ్లతో తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారు. ఓ వ్యక్తి ధైర్యం చేసి వారిని నిలదీయడంతో ఎదిరించి తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో స్థానికులు ధైర్యంగా వెంటాడడంతో తమ ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. కాగా, ఈ ప్రాంతంలో ఓ రైతు పొలంలో ఉన్న శ్రీగంధం చెట్లను నరికి తీసుకెళ్లేందుకు వచ్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. రెండ్రోజుల క్రితం కొన్ని చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. దుండగులు వదిలి వెళ్లిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

రబీ వేరుశనగ సాగుకు వేళాయె



అనంతపురం అగ్రికల్చర్: రబీలో నీటి వసతి కింద వేరుశనగ పంట విత్తుకునేందుకు డిసెంబర్ 15 వరకు అనుకూల సమయమని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ రబీలో జిల్లా వ్యాప్తంగా 20 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ సాగులోకి రావచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. ఇటీవల మంచి వర్షాలు కురవడంతో ఆలస్యం చేయకుండా విత్తుకోవాలని సూచించారు. తొలి దశలో పంటకు చీడపీడలు, తెగుళ్లు ఆశించకుండా ఉండేందుకు కిలో విత్తనానికి 2 మి.లీ ఇమిడాక్లోప్రిడ్, 3 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తనశుద్ధి చేసుకుని విత్తుకోవాలన్నారు. విత్తుకున్న 24 నుంచి 48 గంటల్లోపు ఎకరాకు ఒకటి లేదా ఒకటిన్నర లీటర్ చొప్పున కలుపు మందు 20 శాతం పెండీమిథాలిన్‌ను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చు పురుగు ఉధృతి తగ్గించేందుకు పొలం చుట్టూ నాలుగైదు వరుసల్లో సజ్జ, జొన్న విత్తనాలను రక్షణ పంటగా విత్తుకోవాలన్నారు. పంట కాలంలో సిఫారసు చేసిన మోతాదులో మందుల పిచికారీ, ఎరువుల వాడకం, నీటి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

- ఖరీఫ్ సీజన్ సాగులో ఉన్న పత్తికి ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గులాబీరంగు కాయ తొలచు పురుగు (పింక్ బౌల్ వార్మ్) ఆశించే పరిస్థితి ఉందని, పురుగు ఉనికి గుర్తించడానికి ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోజుకు 8 రెక్కల పురుగులు ఉన్నట్లు గమనిస్తే లీటర్ నీటికి 2 మి.లీ ప్రాపినోఫాస్ లేదా 2.5 మి.లీ క్లోరిపైరిపాస్ లేదా 2 మి.లీ క్వినాల్‌ఫాస్ లేదా 1 మి.లీ ఇండాక్సికార్బ్ లేదా 0.3 మి.లీ స్పైనోసాడ్ కలిపి పిచికారీ చేయాలన్నారు.
- కందిలో మారుకామచ్చల పురుగు, పచ్చపురుగు ఉధృతిని బట్టి లీటర్ నీటికి 0.3 మి.లీ బట్టిక్లోరాన్ ట్రినిలిప్రోల్ లేదా 0.4 గ్రాములు ఎమామెక్టిన్ బెంజోయేట్ కలిపి పిచికారీ చేస్తే ఆశించిన ఫలితాలు దక్కుతాయన్నారు.

'ఉపాధి' లక్ష్యాలు పూర్తి చేయాల్సిందే

అనంతపురం అర్బన్: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించడంలో వెనకబడితే ఉపేక్షించబోనని, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాల్సిందేనని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి డ్వామా అధికారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ బడ్జెట్‌లో కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ అంశంలో వజ్రకరూరు, కూడేరు మండలాలు వెనకబడ్డాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్న చోట సంబంధిత ఎంపీడీఓలు నివేదిక సిద్ధం చేసి డ్వామా పీడీకి సమర్పించాలని చెప్పారు. ఉపాధి కూలీల హాజరు సంఖ్య పెంపు, వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య పెంచాలన్నారు. బీటీ రోడ్ల పనులను లక్ష్యాన్ని పూర్తి చేయాలని చెప్పారు. సీసీ కాలువల నిర్మాణంలో పురోగతి సాధించాలని ఆదేశించారు. హార్టికల్చర్‌కు సంబంధించి ప్లాంటేషన్ వారంలోగా పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా జరుగుతున్న పనులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. మండల స్థాయి అధికారులతో సమీక్షిస్తూ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ సలీంబాషా, ఉద్యాన శాఖ డీడీ నరసింహారావు, హౌసింగ్ పీడీ శైలజ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 68 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 68 వినతులు అందాయి. ఎస్పీ పి.జగదీష్ స్వయంగా వినతలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్ చేసి ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, మహిళా డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

కూడేరు/రాప్తాడురూరల్: కూడేరు మండలం రామదుర్గం ఆలయ సమీపంలో సోమవారం కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని కూడేరు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.10,500 నగదు, 14 ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అలాగే అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామ శివారులో కోడి పందెం ఆడుతూ 16 మంది ఇటుకలపల్లి పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ. 60,100 నగదు, 18 బైకులు, రెండు పందెం కోళ్లు, నాలుగు కోడి కత్తులు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ హేమంత్‌కుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



చిరుత దాడి.. 65 గొర్రెపిల్లల మృతి



మృతి చెందిన గొర్రెపిల్లలు

శింగనమల: చిరుత దాడిలో 65 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధిత కాపరులు తెలిపిన మేరకు... శింగనమలకు చెందిన నాగలాపురం రాఘవ , ఎరికల నాగరాజు... గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తమ గొర్రెలను మేపునకు తోలుకెళుతూ 65 గొర్రె పిల్లలను శింగనమల కొండ దిగువన దొడ్డిలో వేసి, కంచె వేశారు. వాటి వద్ద కాపలాకున్న రాఘవ... మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్లి తిరిగి వచ్చేలోపు గొర్రెపిల్లలన్నీ మృతి చెంది ఉన్నాయి. సమాచారం అందుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని పరిశీలించారు. కళేబరాలపై ఉన్న పంటి గాట్లను బట్టి చిరుత దాడిలో మృతి చెందినట్లుగా నిర్ధారించుకున్నారు. శింగనమల కొండలో ఇటీవల చిరుత సంచారాన్ని చూసినట్లుగా స్థానికులు తెలిపారు. ఘటనలో దాదాపు రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరులు వాపోయారు.

ఆటో బోల్తా



కంపచెట్ల నుంచి క్షతగాత్రులను వెలికి తీస్తున్న దృశ్యం

గుత్తి: స్థానిక గుంతకల్లు రోడ్డులో చెరువు కట్ట వద్ద సోమవారం ఉదయం ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలోని కంపచెట్లలో బోల్తా పడింది. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 12 మంది గాయపడ్డారు. వివరాలు... నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం నందివర్గం గ్రామానికి చెందిన 15 మంది కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని సోమవారం తిరుగు ప్రయాణమైన వారు గుత్తి శివారులోకి చేరుకోగానే చెరువు కట్ట వద్ద ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో అంజనమ్మ, ఆలుమూరు, రామాంజనేయులు, హనుమన్న, నిర్మలమ్మ, లక్ష్మీ, సుప్రియా, కీర్తితో పాటు మరో నలుగురు గాయపడ్డారు. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను వెలికి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు

కర్ణాటకలో ప్రమాదం... కంబదూరు వాసి దుర్మరణం



రఫీక్ (ఫైల్)

కంబదూరు: కర్ణాటకలోని కె.రాంపురం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో కంబదూరుకు చెందిన ఎస్ఎండీ రఫీక్ (27) దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... రఫీక్, గిరి, హుసేన్ స్నేహితులు. వీరు ముగ్గురూ సోమవారం ఉదయం పావగడ నుంచి ద్విచక్ర వాహనంపై కంబదూరుకు బయలుదేరారు. కె.రాంపురం వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. రఫీక్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కర్ణాటక పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇసుక డంప్ సీజ్



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం కల్యం గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సోమవారం ఉదయం రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ, పోలీసు అధికారులు గుర్తించి, సీజ్ చేశారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు... బాదనహాళ్ వద్ద ఉన్న హగరి నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ట్రాక్టర్లతో ఇసుక తరలించి నిల్వ చేసినట్లుగా సమాచారం అందడంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సుమారు 42 క్యూబిక్ మీటర్ల నిల్వలను గుర్తించి సీజ్ చేశారు. అయితే ఇసుక ఎవరు తరలించారు? ఎందుకు నిల్వ చేశారు? అనే అంశంపై విచారణ కొనసాగుతోంది.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

విడపనకల్లు: మండలంలోని డొనేకల్లులో సోమవారం ఉరవకొండ ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. దాసరి భార్గవ నుంచి 192 హైవార్డ్స్, చీర్స్ విస్కీ టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు రవిచంద్ర, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లకు నిరీక్షణ



ఈ ఫొటోలో కనిపిస్తున్న పొలం ఆత్మకూరుకు చెందిన ఓ రైతుది. కొన్ని నెలల క్రితం బోరు వేయించడంతో నీరు సమృద్ధిగా పడ్డాయి. విద్యుత్ పరికరాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నాడు. విద్యుత్ కనెక్షన్ వస్తుందనే నమ్మకంతో పొలంలో మామిడి మొక్కలు నాటాడు. నెలలు గడుస్తున్నా.. విద్యుత్ పరికరాలు రాకపోవడంతో అధికారులను కలిశాడు. ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పుడు వస్తాయో చెప్పలేమని విద్యుత్ అధికారులు చేతులెత్తేశారు. చేసేది ఏమీలేక సమీపంలోని రైతుతో మాట్లాడుకుని చెట్లకు నీరు అందిస్తున్నాడు. విద్యుత్ కనెక్షన్ ఇస్తే సమస్య తీరుతుందని సదరు రైతు కోరుతున్నాడు.

- ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాల కోసం అన్నదాతల ఎదురుచూపులు
- పొలాల్లో నిరుపయోగంగా బోర్లు
- అధికారుల చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నా ఫలితం శూన్యం
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు



ట్రాన్స్‌కో కార్యాలయం వద్దకు అరకొరగా వచ్చిన విద్యుత్ స్తంభాలు

ఆత్మకూరు: బోర్లు వేసుకుని పంటలు సాగు చేసుకుందామని అనుకున్న రైతులకు ప్రభుత్వం మొండి చేయి చూపుతోంది. విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. వ్యవసాయం చేసే రైతన్నలకు అండగా నిలవడం లేదు. ఈ ఏడాది ప్రారంభంలో ఒక్కో రైతు 300 నుంచి 400 అడుగుల వరకూ బోర్లు వేయించారు. బోరుకు రూ.70 వేలు, విద్యుత్ మోటార్‌కు రూ.70 వేలు చొప్పున ఖర్చు పెట్టుకున్నారు. నీరు సమృద్ధిగా పడటంతో విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో సర్వీసులకు బ్రేక్ పడింది. ఎన్నికల అనంతరం కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో తమ సమస్య తీరుతుందని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. సర్వీసుల కోసం అధికారుల చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి రాకపోతే మేము ఎక్కడ నుంచి ఇవ్వాలి అంటూ విద్యుత్ అధికారులు సమాధానం ఇస్తున్నారు. ప్రస్తుతం ఆత్మకూరు మండల వ్యాప్తంగా 150 మందికి పైగా రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్ల కోసం నిత్యం విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 1000 మంది రైతులు బోర్లు వేసి విద్యుత్ పరికరాల కోసం నిరీక్షిస్తున్నట్లు సమాచారం.

పలుకుబడి ఉన్నోళ్లకే స్తంభాలు

గత ఏడాది డిసెంబర్, జనవరి నెలలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని డీడీలు కట్టిన రైతులకు పరికరాలు అందలేదు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అరకొరగా రావడంతో పలుకుబడి ఉన్నోళ్లకే ఇచ్చేస్తున్నారు. మండలంలో ముందు డీడీలు కట్టిన వారికి ఇవ్వకుండా.. ఎమ్మెల్యే లెటర్, అధికార పార్టీ నాయకులతో ఫోన్‌లు చేయించిన వారికి పరికరాలు ఇచ్చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా గతంలో గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందుకున్న కొంతమంది రైతులు.. వైర్లు, మిగిలిన వస్తువులు కొనుగోలు చేసుకున్నారు. మిగిలిన రైతులు వైర్లు, మరికొన్ని పరికరాల కోసం ఎదురుచూస్తున్నారు.

పంటల సాగుకు బోర్లే ఆధారం

మెట్ట ప్రాంత రైతులకు ప్రధాన ఆధారం విద్యుత్ బోర్లు. ఆత్మకూరు, యాలేరు, కొత్తపల్లి, గొరిదిండ్ల, ముట్టాల, సనప, పంపనూరు, తోపుదుర్తి, మదిగుబ్బ గ్రామాల రైతులు ఎక్కువగా బోర్లు కింద వ్యవసాయం చేస్తున్నారు. 90 శాతం సాగు బోర్ల కిందే జరుగుతుంది. ఇటీవల చిన్న, సన్నకారు రైతులు కూడా అప్పులు చేసి మరీ బోర్లు వేయించారు. రూ.లక్షలు ఖర్చు చేసి బోర్లు వేయించినా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురిచేస్తోంది. బోర్లలో నీరు సమృద్ధిగా వస్తున్నా విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. తమ గోడు ప్రభుత్వానికి పట్టదా? అంటూ అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా స్పందించి విద్యుత్ పరికరాలు అందజేయాలని కోరుతున్నారు.



పక్క పొలం నుంచి కర్రల సహాయంతో విద్యుత్ కనెక్షన్ తీసుకున్న దృశ్యం

ఏం చేయాలో తెలియడం లేదు



రూ.లక్షలు ఖర్చు పెట్టుకుని బోర్లు వేయించాం. నీరు సమృద్ధిగా పడటంతో ట్రాన్స్‌ఫార్మర్లకు దరఖాస్తు చేసుకున్నాం. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఇచ్చారు. అప్పటి నుంచి పంట పెట్టుకుందామని అనుకుంటే వైర్లు, ఇతర సామగ్రి ఇవ్వలేదు. బయట మార్కెట్‌లో కొనాలంటే రూ.వేలల్లో ఖర్చు పెట్టుకోవాలి. పరికరాల కోసం ఇప్పటికే డీడీలు కట్టాం. మిగిలిన పరికరాలు ఇస్తే విద్యుత్ కనెక్షన్ తీసుకుని పంటలు సాగు చేసుకుంటాం.

– జగదీశ్వరరెడ్డి, రైతు, ఆత్మకూరు

వచ్చిన వెంటనే అందజేస్తాం

మండలంలో దాదాపు 150 మందికి పైగా రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గతంలో కొంత మందికి ట్రాన్స్‌ఫార్మర్లు అందించాం. కాని వైర్లు రాలేదు. ప్రస్తుతం కూడా కొన్ని విద్యుత్ స్తంభాలు వచ్చాయి. వచ్చిన విద్యుత్ స్తంభాలను డీడీలు చెల్లించిన రైతులకు అందజేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, మిగిలిన పరికరాలు ప్రభుత్వం నుంచి వచ్చిన వెంటనే రైతులకు అందజేస్తాం.

– దాస్, ట్రాన్స్‌కో ఏఈ

రాయలసీమకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కర్నూలుకు కేటాయించిన లోకాయుక్త, హెచ్ఆర్సీ కార్యాలయాలను అమరావతికి తరలించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. రాయలసీమకు అన్యాయం చేస్తే ప్రజలందరినీ ఏకం చేసి ఉద్యమిస్తామని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కర్నూలులో లోకాయుక్త, హెచ్ఆర్సీ, లా యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇప్పుడు వాటిని అమరావతికి తరలించేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. గతంలోనూ హంద్రీనీవాను పూర్తీ చేయకుండా కేవలం పునాదిరాళ్లకే పరిమితం చేశారని ఎద్దేవా చేశబూరు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చలవతో హంద్రీనీవా ద్వారా సీమ ప్రజలకు నీరందేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. శ్రీశైలం జలాశయంలో విద్యుత్ ఉత్పత్తిని ఆపేసి, కేవలం సాగునీటి కోసమే ప్రాజెక్టును కొనసాగిస్తే అన్ని ప్రాంతాల వారికి మేలు జరుగుతుందన్నారు. రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై టీడీపీ ప్రజాప్రతినిధులందరూ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, సీమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అబూసలేహా, లాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని ఆత్మహత్య

అనంతపురం: నగరంలోని రాజీవ్ కాలనీకి సమీపంలో సంచార తెగకు చెందిన ఏసుకొండలు (20) మద్యం మత్తులో ఎలుకల మందు తిని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

క్లుప్తంగా

అర్జీదారులకు సౌకర్యాలు



అర్జీలు రాసి ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్లు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు చెప్పుకునేందుకు నలుమూలల నుంచి ప్రజలు వస్తుంటారు. గతంలో కలెక్టరేట్ ఆవరణలో కూర్చునేందుకు, అర్జీలు రాయించుకునేందుకు సరైన వసతులు ఉండేవి కాదు. ఇక అర్జీ సమర్పించేందుకు క్యూలో నిలబడాల్సి వచ్చేది. గత వారం కలెక్టర్ వినోద్‌కుమార్ నేరుగా ప్రజల వద్దకు వెళ్లి అర్జీలు స్వీకరించారు. వారు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో స్పందించిన అధికారులు.. సోమవారం అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా మీసేవ కౌంటర్ ఏర్పాటు చేశారు. అర్జీలు సమర్పించేందుకు రెవెన్యూ భవన్‌లోకి వెళ్లే ప్రజలు నిలబడకుండా కూర్చొనేందుకు వీలుగా కుర్చీలు వేయించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

అనంతపురం సిటీ: అసంఘటిత రంగంలోని కార్మికులందరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ కోరారు. అనంతపురంలోని న్యాయ సేవా సదన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏ అధికారి నుంచైనా ఇబ్బంది ఎదురైతే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను ఆశ్రయించి చట్ట పరిధిలో తమ సమస్యను పరిష్కరించుకోవచ్చని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం అమలవుతున్న పథకాలను కార్మిక శాఖ అధికారులు సుజాత, ప్రతాప్ నాయుడు, న్యాయవాది హరికృష్ణ వివరించారు.


మరువవంకను మూసేసిన ఘనుడు



కాలువను దారి మళ్లించడంతో రోడ్డుపైకి వస్తున్న మురుగు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఆస్తులు, అధికారులంటే కొందరికి లెక్కే లేకుండా పోయింది. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా పలాన స్థలం తమదంటూ ఓవరాక్షన్ చేయడం పరిపాటిగా మారిపోయింది. గతంలో రాజహంస అపార్ట్‌మెంట్ ఎదురుగా ఓ వ్యక్తి ఇలాగే బ్రిడ్జికు అడ్డంగా మట్టి వేసి ప్రజలను మూడు, నాలుగు రోజుల పాటు ముప్పుతిప్పలు పెట్టాడు. తాజాగా సోమవారం వేణుగోపాల్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన స్థలంలో వంక వెళ్తోందని.. వంకను మూసేశాడు. ఆ మురుగును 80 ఫీట్ రోడ్డులోకి మళ్లించాడు. మురుగు రోడ్డుపైకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం కమిషనర్ నాగరాజు, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి దృష్టికి వెళ్లడంతో వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. కాలువ మూసేసిన వ్యక్తితో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కల్గించేలా వ్యవహరించడం సరికాదన్నారు. అందుకు అక్కడి స్థల యజమాని గతంలోనే తాము ఫిర్యాదు చేశామని పట్టించుకోలేదని చెప్పారు. అయినా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం సరికాదని సదరు వ్యక్తికి సర్దిచెప్పారు. సర్వే చేసిన తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో సమస్య సద్దుమనిగింది. కార్యక్రమంలో టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరా పాహిమాం



కాశీవిశాలాక్షి, విశ్వేశ్వరుడిని ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్/రాప్తాడు: ఓం నమః శివాయ అంటూ భక్తుల నామస్మరణతో అనంత మార్మోగింది. కార్తీక మాసంలో వచ్చిన మూడవ సోమవారం కావడంతో నగరంలోని శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో సందడి నెలకొంది. పాతూరులోని ఉత్తరాధిమఠం (చిన్నాంజనేయ స్వామి గుడి)లో సోమవారం విశ్వ మధ్వపరిషత్తు వారి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ధాత్రి వనమహోత్సవాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు.

వారసత్వ సంపదను కాపాడుకుందాం



హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం కల్చరల్: చారిత్రక వారసత్వ సంపదను కాపాడుకుందామని పలువురు వక్తలు పిలునిచ్చారు. ఇంటాక్, పర్యాటక శాఖ, మ్యూజియం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సాగే ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా సోమవారం హెరిటేజ్ వాక్ నిర్వహించారు. స్థానిక కోర్టు రోడ్డులోని పీస్ మెమోరియల్ హాల్ వద్ద ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు జెండా ఊపి హెరిటేజ్ వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిస్కవర్ అండ్ ఎక్స్‌పీరియన్స్ డైవర్సిటీ అనే నేపథ్యంతో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. పెనుగొండ, గుత్తి కోటలు, తాడిపత్రి ఆలయాలు, పుట్టపర్తి వంటి ఆధ్యాత్మిక, అపురూపమైన చారిత్రత్మక సంపద విదేశీయులను ఆకర్షిస్తోందన్నారు. అనంతకు గర్వకారణమైన చరిత్రపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు తరచుగా చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తూ వాటి ప్రాధాన్యత తెలుసుకోవాలని సూచించారు. అంతకుముందు కోర్టు రోడ్డు నుంచి ప్రారంభమైన హెరిటేజ్ వాక్ జిల్లా మ్యూజియం వరకూ సాగింది. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ రామకుమార్, ప్రతినిధులు నబీరసూల్, షరీఫ్, రియాజుద్దీన్, పురావస్తు శాఖ ఏడీ రజిత, పర్యాటక శాఖ అధికారి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలల పని వేళల పెంపు సరికాదు'



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: పాఠశాలల పని వేళలను సాయంత్రం 5 గంటల వరకూ పెంచడం సరికాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొని పాతిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని ముట్టాల ఉన్నత పాఠశాలలో ఆయన ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులపై అపార్, 10వ తరగతి నామినల్ రోల్స్ రెండు పనులు ఒకేసారి చేపట్టడం వల్ల విపరీతమైన ఒత్తిడికి గురువుతున్నారని తెలిపారు. అపార్ నమోదుకు మరికొంత సమయం కేటాయించాలని కోరారు. చాలా ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లం ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతోందన్నారు. వెంటనే కోర్టు సమస్యలను పరిష్కరించి ఆంగ్లం ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. అదే విధంగా ప్రస్తుతం పని చేస్తున్న పీఈటీలకు విద్యార్హత లేక పీడీలుగా ప్రమోషన్‌లు పొందలేకపోయిన పీఈటీలకు ఇన్ సర్వీస్ బీపీఈడీ సౌకర్యం కల్పించాలన్నారు. దూరవిద్య ద్వారా అవకాశం కల్పించి వారికి విద్యార్హత కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక శాఖ కన్వీనర్ గురురాజు, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, మల్లేష్ రెడ్డి, రామలింగయ్య, సుభాన్, జగన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ల బాధ్యతల స్వీకరణ



ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో నూతనంగా నియామకమైన పలువురు డైరెక్టర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్‌గా ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, అడ్మిషన్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఏ.సురేష్ బాబు, ఇండస్ట్రీయల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి ఆయా చాంబర్లలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్లను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అభినందించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

రాప్తాడు రూరల్/అనంతపురం అర్బన్/రాప్తాడు/ఆత్మకూరు: పేద ప్రజలకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు ఇంటి స్థలాలను వెంటనే మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరులో తహసీల్దార్, సచివాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. సోములదొడ్డి పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వస్తే పేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జాప్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఇళ్ల స్థలాల విషయంపై కనీసం ఎలాంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, సీపీఐ రాప్తాడు నియోజవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి ఎం.రమేష్, రాప్తాడు, ఆత్మకూరుకు చెందిన సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో కదలిక

- రేపు 'మునిసిపల్' హెచ్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్
- తుది సీనియార్టీ జాబితా విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: ఎట్టకేలకు జిల్లాలో కార్పొరేషన్, మునిసిపల్ స్కూళ్ల టీచర్ల పదోన్నతుల్లో కదలిక వచ్చింది. ఈనెల 6న జరగాల్సిన ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ఈనెల 20న చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించిన తుది సీనియార్టీ జాబితాలను సోమవారం విడుదల చేశారు. హెచ్ఎం, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో 20న పదోన్నతుల కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

మొత్తం 6 పోస్టుల భర్తీ..

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో 3 హెచ్ఎం పోస్టులు, మునిసిపాలిటీల్లో 3 హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో నేతాజీ నగరపాలక స్కూల్ ఎస్ఏ బయాలజీ టీచర్ ఎస్.లక్ష్మి మొదటి పేరులో ఉండగా, తర్వాత వరసగా 5 మంది శారదా నగరపాలక ఉన్నత పాఠశాల టీచర్లు ఉండటం విశేషం. రెండో స్థానంలో గణితం టీచర్ ఎం.శ్రీదేవి, మూడో స్థానంలో గణితం టీచర్ వై.రేణుక, నాల్గో స్థానంలో సోషల్ టీచర్ ఎస్.వాసుకి, ఐదో స్థానంలో గణితం టీచర్ ఎస్.శ్రీలత, ఆరో స్థానంలో బయాలజీ టీచర్ ఎం.రజియాబేగం ఉన్నారు. మునిసిపాలిటీలకు సంబంధించి రాయదుర్గంలో రెండు, గుంతకల్లులో ఒక హెచ్ఎం పోస్టు ఖాళీగా ఉంది. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. ఫైనల్ సీనియార్టీ లిస్టులు ప్రకటించామన్నారు. ఈనెల 20న హెచ్ఎం, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ చేపడతామన్నారు.

ఫీజుల వేధింపులు నియంత్రించాలి

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ఫీజుల వేధింపులు నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జేఎన్‌టీయూ(ఏ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. మొత్తం ఫీజు చెల్లిస్తేనే హాల్‌టికెట్ ఇస్తామని బెదిరించడం సరికాదన్నారు. వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి ఆయా ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుని విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓతరు పరమేష్, సిద్ధు, భీమేష్, సోము, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి

అనంతపురం అర్బన్: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతులతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు పలు మండలాల్లో జొన్న, మొక్కజొన్న, అరటి, చామంతి, తదితర పంటలు పూర్తిగా దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. అధికారులు తక్షణం పంట నష్టం అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. పాడి చెరువు నుంచి కోటంక చెరువులోకి ఉన్న కాలువను కొందరు దౌర్జన్యంగా పూడ్చివేశారని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మకు రైతులు విన్నవించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు రామసుబ్బారెడ్డి, విశ్వనాథ్, పెద్ద నారాయణ, ఓబులేసు, నారాయణరెడ్డి, తదితరులు జేసీకి వినతిపత్రం అందజేశారు. కాలువ ప్రభుత్వ భూమిలో ఉన్నప్పటికీ కొందరు తమ స్వప్రయోజనం కోసం ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.

ఆదర్శప్రాయుడు భక్త కనకదాస



కనకదాస విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర రెడ్డి, మాజీ మేయర్ రాగే పరుశురాం



రాప్తాడు: కనకదాస జయంతిలో పాల్గొన్న నాయకులు



ఆత్మకూరు: కనకదాస చిత్రపటానికి పూజలు చేసిన ఎంపీపీ హేమలత, అధికారులు

అనంతపురంకార్పొరేషన్/అనంతపురం/రాప్తాడు/ఆత్మకూరు/అనంతపురం రూరల్: అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరులో సోమవారం భక్త కనకదాస జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పాతూరులోని భక్త కనకదాస విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మాజీ మేయర్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ రాగే పరుశురాం, మాజీ బీసీ కమిషన్ సభ్యుడు, విశ్రాంత జడ్జి కిష్టప్ప తదితరులు నివాళులర్పించారు. జేఎన్‌టీయూ(ఏ) పాలక భవనంలో భక్త కనకదాస చిత్రపటానికి ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చెన్నారెడ్డి, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ ఎన్ .దేవన్న, రిజిస్ట్రార్ కృష్ణయ్య, తదితరులు పూలమాల వేశారు. రాప్తాడులో కనకదాస జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కురుబ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దండు వెంకటరాముడు మాట్లాడుతూ.. కురుబలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఐక్యమత్యంతో ముందుకెళ్లాలన్నారు. ఇక ఆత్మకూరులో జరిగిన వేడుకల్లో ఎంపీపీ సుబ్బర హేమలత ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, మాజీ వైస్ ఎంపీపీ ప్రతాప్, ఏపీఓ సుజాత, హౌసింగ్ ఏఈ జమీల్ అహమ్మద్, శశాంక్, కురుబలు తిక్కస్వామి, ఆదెప్ప, గోపి తదితరులు పాల్గొన్నారు. భక్త కనకదాస జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు సురేంద్రగౌడ్, డీకే రామలింగయ్య, విష్ణువర్ధన్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.